కథానిక

మచ్చల శంఖం

"హిత శ్రీ"

సిమెంటు చప్టాలా ఉన్న ఇసుక నేలమీద నడుస్తున్నాడు వల్లభరావు, అడుగులో అడుగు వేసుకొంటూ. సముద్రపు నీరు అతని కాళ్ళని తడపటానికి మాటిమాటికి ప్రయత్నించి కవ్విస్తోంది. బీచ్‌లో జనం ఎక్కువమంది లేరు. అక్కడక్కడ విడివిడిగా కొంతమంది కూచున్నారు. ఎదురుగా ఎవరో వొస్తున్నారు, కులాసాగా కబుర్లు చెప్పుకొంటూ. ఎక్కడికో అర్జంటుగా పోతున్నట్టు గాలి రంయిమని వీస్తోంది. ఆ వాతావరణంలో వల్లభరావు తనకు తెలియకుండానే తన జీవితంలో ఓ పది పదిహేనేళ్ల కాలం తగ్గించేసుకొన్నాడు.

రకరకాల నత్తగుల్లల్ని ఒడ్డుమీద పడేసి పోతున్నాయి అలలు. అవన్నీ పరిశీలిస్తూ పరధ్యానంగా నడుస్తున్న వల్లభరావుని ఓ పెద్దఅల చుట్టుముట్టేసింది. చిరునవ్వు నవ్వుతో అలాగే నుంచున్నాడతను. కాళ్లక్రింద ఇసుక జారిపోతుంటే తమాషాగా ఉంది. నీళ్ళు వెనక్కిపోతూ అతనికో బహుమానం ఇచ్చాయి. ముచ్చటపడి చేతిలోకి తీసుకొన్నాడు. చిన్న శంఖం. తెల్లగా మెరుస్తోంది. అక్కడక్కడ నల్లటి మచ్చలు అందంగా ఉన్నాయి.

ముందుకు సాగి ప్రక్కకి చూశాడు వల్లభరావు. ఎవరో చిన్న కుర్రాడు తన చేతిలోని శంఖంవైపు చూస్తూ నుంచున్నాడు. కొంచెం దూరంలో వాళ్లమ్మ కాబోలు కూచుని సముద్రంవైపు చూస్తోంది. వల్లభరావు దగ్గరగా వొచ్చాడు. ఆ కుర్రాడు అతనివైపు కళ్లెత్తి చూచాడు. మిలమిలా మెరిసే ఆ కళ్ళని చూసి ముచ్చటపడ్డాడు వల్లభరావు. ఆరేళ్ళకంటే ఉండవేమో. ఎంతో బావున్నాడు. వల్లభరావుకి ఆ కుర్రాడేం చేస్తాడో చూడాలనిపించింది. బహుశ, ఆ శంఖం కావాలని వాళ్ళమ్మతో మారాం చేస్తాడు. ఆ మారాం చూడాలనిపించిందతనికి. కాని అలాంటి పనేమి వాడు చేయలేదు. అలాగే శంఖంవైపూ, వల్లభరావువైపూ చూడసాగాడు. వల్లభరావుకి జాలి వేసింది. హృదయంలో ఏదో అనురాగంలాంటి భావం మెరిసింది. దగ్గరగా వెళ్ళి శంఖం వాడిచేతి కందించాడు. కొంచెంసేపు బెరుకుగా వల్లభరావువైపు చూశాడు వాడు.

"ఫరవాలేదు లే, తీసుకో."

ఈ మాటలకి ఆమె తల పక్కకి తిప్పి వల్లభరావువైపు చూసింది. కాని అతనామెవైపు చూడలేదు. ఆ కుర్రాడు శంఖం తీసుకున్నాడు. అటూ ఇటూ తిప్పి చూడసాగాడు.

"నీ పేరేమిటోయ్!"

వాడు తలెత్తి వల్లభరావువైపు చూశాడు. ఏదో చెప్పాలని కాబోలు పెదవులు ప్రయత్నించాయి. కాని వల్లభరావుకి ఏ సమాధానమూ వినిపించలేదు. ఆ కుర్రాడిమీద మరికొంచెం ఆదరం కలిగిందతనికి. తను కొత్తవాడాయె!

కొంచెం బుజ్జగిస్తూ అన్నాడు:

"చెప్పు, బాబూ!"

వాడు మళ్ళీ పెదవులు కదిలించాడు. ముఖంలో ఏదో బాధ ప్రస్ఫుటమైంది. కళ్ళల్లో ఏదో దీనత్వం గోచరించింది.

"చెప్పలేడు—"

వేదనాభరితమైన ఆ స్వరం వల్లభరావు హృదయంలో ఇంతవరకూ మృదుమధుర సంగీతం వినిపిస్తున్న తంత్రుల్ని నిర్దయగా తెగ్గొట్టింది. ఆమెవైపు మొదటిసారిగా రెప్పవాల్చకుండా చూశాడు. మూర్తీభవించిన నిరాశలా, నిస్పృహలా, అచేతనంగా ఆమె తలదించుకొని అలాగే కూచునిఉంది. ఆమె మనసులో తుపాను రేగిందని తెలుసుకోటానికి ఎంతోసేపు పట్టలేదు అతనికి. జాలిగా చూశాడు. వెంటనే అతనికి మరో విషయం స్ఫురించింది. ఆమె వితంతువు. అతని హృదయం గతుక్కుమంది. ఆవెను వెంటనే మరో సంగతి—బాధాకరమైన మరో కొత్తవిషయం తెలిసింది—ఆమె కట్టుకున్న తెల్లటిచీరకి అక్కడక్కడ అతుకులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇహ ఆమెకేం మిగిలింది. అతని హృదయంలో చెయ్యిపెట్టి కలచినట్టయింది. ఆ చుట్టుప్రక్కల ఆవరించిఉన్న ఆనంద

మయ వాతావరణంతో ఆమె కేమీ సంబంధం లేదు. ఓ నిట్టూర్పు విడిచాడు వల్లభరావు. చూపులు ఆ పసివాడిమీదికి మరలించాడు. మూగజీవి!

అతని హృదయంలో కరుణ కట్టలు తెంచుకొని ప్రవహిస్తోంది. ఆ ఇద్దరు అభాగ్యులవైపూ జాలిగా, సానుభూతితో చూస్తూ ఉండిపోయాడు. అక్కడినించి కదలిపోటానికి అతనికి మనస్కరించటంలేదు. నిమిషాలు ఒకటివెంట ఒకటి గడిచిపోయాయి.

"ఎవరైనా చూస్తే బావుండదు..."

ఆ హీనస్వరం అతన్ని మేల్కొల్పింది. వెంటనే చిన్నబుచ్చుకొన్నాడు. తను చేసింది పొరపాటే. ఇందాకనే వెళ్ళిపోవాలిసింది. కాని...

వల్లభరావు ఆ పసివాడివైపు మరోసారి జాలిగా చూసి నెమ్మదిగా అడుగు ముందుకేశాడు. అతని మనసులో ఆలోచనల దుమారం రేగింది. అంత చక్కటి కుర్రాడికి ఈ లోపమేమిటి! వాడి చూపులు జ్ఞాపకం వొచ్చాయి. ఆ అమాయిక జీవి భావాలన్నీ అలాగే లోలోపల అణిగిపోవాలి. తన ఉద్రేకాలు, భావాలు మాటల్లో వెలిబుచ్చలేడు. మనసులోనే ఆపుకోవాలి. వల్లభరావు ముఖంలో విషాదం ఆవరించింది. ఏ పెద్ద హాస్పిటల్ లోనైనా చూపిస్తే ప్రయోజనముంటుందేమో! చూపించారో, లేదో! చూపించటానికి డబ్బెక్కడినించి వొస్తుంది? ఆమెని చూస్తే పరిస్థితంతా అర్థమైపోతుంది. ఎలా మరి? తనేమైనా సహాయం చేస్తే! ఏం సహాయం? ఏ విధంగా చేయటం? హుఁ—తనకి ఇతరులకు సహాయం చెయ్యగల పటిమ ఎక్కడుంది? తనేమైనా ధనవంతుడా? పరపతి కలవాడా? ఒక సామాన్య మానవుడు. ఏమీ చెయ్యలేని సామాన్యమానవుడు. కాని ..కాని... ఏమైనా చెయ్యాలి.

వల్లభరావు మనసంతా పాడయిపోయింది. కాళ్ళీడ్చుకు పోయినంతవరకూ పోయాడు. చీకటి పడ్డది. అస్పష్టంగా వెన్నెల పడుతోంది. వెనక్కి తిరిగాడు. అవే ఆలోచనలు.

అలా ఆలోచిస్తూ నడుస్తున్న వల్లభరావుకి వెన్నెల్లో మెరుస్తూ కనిపించింది—అదే, ఆశంఖమే. తెల్లగా, నల్లటి మచ్చలతో అందంగా కనిపించేది ఆశంఖమే. వల్లభరావు శంఖం చేతిలోకి తీసుకొన్నాడు. నిస్సందేహంగా ఆశంఖమే. ఇక్కడెందుకుంది? మర్చిపోయి వెళ్ళారా? అతను ముందుకి చూశాడు. కొంచెందూరంలో కనిపించాయి ఆకృతులు—తెల్లటి చీరతో నెమ్మదిగా నడుస్తున్న స్త్రీ—ప్రక్కన చిన్నకుర్రాడు. వాళ్ళే—అనుమానం లేదు. అయితే ఈ శంఖం ఇక్కడే ఎందుకు పడేసి వెళ్ళిపోయారు. మర్చిపోయారా? మర్చిపోటానికి అదేమీ కనిపించనంత చిన్నది కాదు. కావాలనే బుద్ధిపూర్వకంగా ఆమె వొదిలేసి వెళ్ళిపోయింది. ఎందుకు? ఇష్టంలేదా తీసుకోటం? వెంటనే అతనికామె మాటలు జ్ఞాపకం వొచ్చాయి.

"ఎవరైనా చూస్తే బావుండదు—"

ఇందాక ఆ మాటల్ని గురించి తను ఎక్కువగా ఆలోచించలేదు. ఆమె అలా ఎందుకంది? ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు? ఆమె అలా ఎందుకనుకోవాలి? తనని అపార్థం చేసుకొందా? మనసులో తను భయపడకపోతే అసలలా అనగలిగిఉండేది కాదు. అవును, ఆమె తనని అపార్థం చేసుకొంది. తన పరిచయంకోసం అలా చేశానని అనుకొందా?

మనుషులు ఇంత త్వరగా ఎందుకు ఇతరులని గురించి అపోహ పడతారు? అంత అనాలోచితంగా ఎందుకు ప్రవర్తిస్తారు?

వల్లభరావుకి ఓ క్షణం ఏహ్యభావం కలిగింది, ఆమెమీద. కాని మళ్ళీ ఆలోచించాడు. తను అనవసరంగా ఆమెను గురించి అపోహపడుతున్నాడేమో! అదే క్షణాన అతనికి తట్టింది అకస్మాత్తుగా. ఆమెని ఏ విషయంలో ఆక్షేపించటానికి ప్రయత్నించాడో, అదే విషయంలో తనని తను ఆక్షేపించుకున్నట్టయింది.

వల్లభరావు వెంటనే సమాధానం చెప్పుకున్నాడు. తననిగురించి తను వేసుకొన్న ప్రశ్న సమంజసంగా లేదు. ఆ కుర్రాడు ముచ్చటపడితే ఆ శంఖం ఇచ్చాడు. ఆమె తొందరపడి ఉండకపోతే, బహుశ తనింకేమైనా చేతనైన సహాయం చేయగల్గి ఉండేవాడేమో. కాని అలాంటివాళ్ళకి సహాయం చెయ్యాలని ముందుకి దూకితే మిగిలేది శ్రమమాత్రమే. ఇతరులు చేసిన ప్రతిపనినీ మరో దృక్పథంలోనుంచి అపార్థం చేసుకొంటే ఎవరూ ఏమీ చెయ్యలేరు. తన సహాయం ఏమీ ఆమె కక్కర్లేదు. మంచిది.

ఆ సమయంలో వల్లభరావుకి చిరుకోపం వచ్చింది. చిరాకు పుట్టింది. ఆ శంఖం ఇవాళ మనసంతా పాడుచేసింది. ఛీ! మొదట ముచ్చటపడ్డాడు కాని చివరకి దానివల్ల జరిగిందిదీ. అతనికి కొంచెం ఆవేశం కలిగింది. బలంకొద్దీ సముద్రంలోకి విసిరేశాడు శంఖం. అతని మనసు కొంచెం తేలికపడ్డది. మళ్ళీ తను సాయంత్రం పొందిన ప్రశాంతత వొచ్చే సూచన కనిపించింది. సముద్రంవైపు అలాగే చూస్తూ

నుంచున్నాడు. వెన్నెల్లో సముద్రం పొంగుతూ కొత్తసౌందర్యం ప్రకటిస్తోంది.

కాని అతినా అవస్థలో ఎక్కువసేపు ఉండలేకపోయాడు. ఆ పసివాడూ ఆమె, మళ్ళీ అతని స్మృతిపథంలో మెదిలారు. తన కెటువంటి దురుద్దేశమూ లేదని ఆమెకి తెలిసేట్టు చెయ్యాలి. ఆమె పశ్చాత్తాపపడుతుంది. వెంటనే వల్లభరావు చకచక నడిచిపోయాడు. వాళ్లని నిర్లక్ష్యంగా దాటిపోయాడు.

అలా దాటిపోయిన వల్లభరావుకి ఆమె ఏం చేస్తుందో చూడాలని బుద్ధిపుట్టింది. తన వెనుక వొస్తోందా? తనతో మాట్లాడాలని త్వరత్వరగా వొస్తోందా? ఓరగా చూశాడు. ఆమె కనిపించలేదు. ఆసముద్రపు హోరులో అలికిడికూడా వినిపించలేదు. వెనక్కి తిరిగాడు. ఆమె తనవైపు నడవటం లేదు! ఆశ్చర్యంవేసింది అతనికి. ఆమె వెనక్కి వెడుతోందేం? ఓ క్షణం అతని మతిపోయింది! ఆమె ఏమిటో వెతుకుతోంది. కొంపతీసి, శంఖంకోసమా? అలాగే వుంది. అయితే, ఆమె నిజంగానే మర్చిపోయిందా? తననిచూసి జ్ఞాపకం తెచ్చుకొందికాబోలు.

వల్లభరావులో మళ్ళీ జాలి ప్రవేశించింది. తనకి తెలిసివుండీ, ఆమెనలా వెదకనియ్యటం క్రూరమనిపించింది. గబగబ నడిచాడు ఆమెఉన్న స్థలంవైపు.

"ఏమిటి వెతుకుతున్నారు?"

ఆమె ఉలిక్కిపడ్డది. తలెత్తి అతనివైపు చూసింది. ఆమె ముఖంలోని విస్మయం ఆ అస్పష్ట కాంతిలో కూడా స్పష్టంగా కనిపించిం దతనికి. ఆమె జవాబుకోసం ఎదురుచూడకుండా అతనే అన్నాడు మళ్ళీ.

"శంఖం కోసమేనా?"

ఓ క్షణం ఆమె ఏమీ అనలేదు. కాని వెంటనే తేరుకుని ఏదో అర్థంచేసుకొన్నట్టుగా అతనివైపు చూసి తలతిప్పి అంది—'కాదు.'

"మరి దేనికోసం?"

ఆమె సమాధానం ఏమి యివ్వలేదు. ఆమె తటపటాయించటం చూసి వల్లభరావు తను అక్కడికి మళ్ళీ రావటం, ఆమెని ప్రశ్నించటం పొరపాటని ఒక్షణం చింతించాడు.

"ఏదైనా వస్తువు పోయిందా?" అడగకూడదని అనుకుంటూనే అడిగాడు. ఆమె అవునన్నట్టు తల తిప్పింది.

"ఏమిటి?"

ఆమె సందిగ్ధావస్థలో పడ్డది. ఈసారి వల్లభరావుకి పూర్తిగా తెలిసిపోయింది. ఆమె తననించి ఏదో దాస్తోంది. దాచాలనే ఆమె ప్రయత్నం; కొన్ని క్షణాలు అలాగే గడిచిపోయాయి. ఆమె కుర్రవాడిని దగ్గరగా తీసుకొని ముందుకు రెండడుగులు వేసింది. వల్లభరావుకి కొంచెం చిరాకూ, కోపమూ కలిగాయి. అసలు సంగతి అతనికి తెలిసింది. తనిచ్చిన ఆ శంఖం అలా అక్కడ వొదిలేసి మళ్ళీ తను వెళ్ళిపోగానే ఇలా ప్రవర్తించటం కేవలం సంకుచితంగా కనిపించకతప్పదు. ఇలాంటి చిన్న విషయాల్లోకూడ మనుషులిలా ఎందుకు ప్రవర్తిస్తారు?

"మీరు వెదికేది శంఖంకోసమే అయితే, అది మళ్ళీ సముద్రంలోకి విసిరేశానని చెప్పటానికి చింతిస్తున్నాను." కొంచెం తీవ్రంగా, అసహనంగా అన్నాడు.

ఆమె ఏమీ జవాబివ్వలేదు. అలాగే వెళ్ళిపోతోంది. ఆమె మౌనం అతనికి కొంచెం ఆశ్చర్యం కలిగించింది. మాట్లాడితేనే నోటిముత్యాలు రాలేట్టు ప్రవర్తిస్తోం దామె. తన దారిని తను పోదామని ఒక్షణం అనుకున్నాడు. కాని ఆమెని మాట్లాడించాలనే పట్టుదల అకస్మాత్తుగా కలిగిం దతనికి.

"మీ రిలా ఎందుకు ప్రవర్తిస్తున్నారో నాకర్థం కావటంలేదు."

ఆమె ఆగింది.

"ఏంచేశాను." నెమ్మదిగా అంది.

"శంఖంకోసం వెతకటం కాదన్నారు. కాని శంఖం పారేశాననగానే వెళ్ళిపోతున్నారు. అసలు సంగతి నా దగ్గిర దాచటమెందుకు? నేను మీకేమి అపకారం తలపెట్టే దురుద్దేశంతో లేనని గ్రహిస్తే బావుండును."

ఆమె ఇలాంటి ప్రశ్న ఎదుర్కొనే స్థితిలో లేదు. ఇంత కుండ బద్దలుకొట్టినట్టుగా అతను మాట్లాడుతాడనీ అనుకోలేదు. మాట్లడకుండా అలాగే నుంచుంది.

"మీరు సమాధానం చెప్పగలితే చెప్పండి. ఇష్టంలేకపోతే వెళ్ళండి. కాని, ఈ సమాధానం కోసం రాత్రిం బగళ్ళు ఒకప్రాణి తలబద్దలు కొట్టుకునే పరిస్థితి తప్పించ దలుచుకుంటే ఉన్నది ఉన్నట్టు చెబితే సంతోషం. జీవితంలో మళ్ళీ యిలాంటి సమస్యలు రాకుండా చేసుకొంటాను."

ఆమె నిట్టూర్పు విడిచింది.

"పొరపాటు చేశాను. మీ రిలా మళ్ళీ వస్తారనుకోలేదు." అని మాత్రం అని ఊరుకుంది.

"అయితే ఆ శంఖం బుద్ధిపూర్వకంగానే అలా వొదిలేశా రన్నమాట."

"అవును."

"ఎందుకు?"

"ఈ ప్రశ్నకి సమాధానం చెప్పాలిసి ఉంటుందనుకోలేదు. అలా అనుకొంటే అలా చెయ్యకపోయే ఉందును. కాని మీరు నిర్బంధిస్తున్నారు కనుక చెప్పక తప్పలేదు. కేవలం మీకోసమే అలా చేశాను."

వల్లభరావు తెల్లబోయాడు. అనుకోని పరిణామం ఎదురౌతోంది.

"నా కోసమే."

"అవును. చిట్టిబాబు మాట్లాడలేడని తెలుసుకున్నప్పుడు మీ మనస్సు చివుక్కుమనటం నేను గ్రహించాను. ఆ బాధ నాకంటే ఎవరికి తెలుస్తుంది. నిరంతరం ఇది మీ మనస్సులో ముల్లులా మెదుల్తుందని ఆ క్షణంలో మిమ్మల్ని చూసిన ప్రతివాళ్లూ గ్రహించగలరు. చాలామంది ఆలాగే బాధపడ్డారు. కాని తరవాత ఎక్కువకాలం వాళ్ళ నా విషయం బాధించలేదు. కాని మీరు బాగా దెబ్బతిన్నారు. ప్రశాంతంగావున్న మనసుకి అకస్మాత్తుగా గట్టిదెబ్బ తగిలింది. ఏమీ మాట్లాడలేకపోయారు. ఏమీ తోచక మిమ్మల్ని మీరే మర్చిపోయారు. అందుకే అలా హెచ్చరించాను. ముమ్ముందు మానసికంగా చాలా బాధపడతారని భయపడ్డాను. ఏం చేయగలను? మనుష్యులు కొన్ని విషయాల్లో పూర్తిగా నిస్సహాయులు. ఎంతోసేపు ఆలోచించాను. మళ్ళీ మీరు తిరిగివొస్తే బావుండుననుకొన్నాను. అలాగే వొచ్చారు. దూరంలో చూశాను. ఆ శంఖం అలా వొదిలి వెళ్ళిపోయాను."

ఆమె ఆగింది. వల్లభరావులో పూర్వపు కాఠిన్యం మంచులా కరిగిపోయింది. ఆమె మళ్ళీ చెప్పటం ప్రారంభిస్తుందని కాసేపు ఎదురుచూశాడు. తరవాత నెమ్మదిగా అందుకొన్నాడు.

"ఎందుకు?"

"ఆ శంఖం అలా పడిఉండటం చూస్తే మీరు మూడు పనులు చెయ్యవచ్చు. నా చేతి కివ్వటమో, లేక అలా దాన్ని వొదిలేసి వెళ్లటమో, లేకపోతే సముద్రంలోకి విసిరి పారెయ్యటమో. మూడో పని చేస్తే నా ప్రయత్నం సఫలమైనట్టే."

వల్లభరావు విస్తుపోయాడు. ఆమెమీద అతని కాక్షణంలో ఎంతో గౌరవం కలిగింది. సరిగా ఆమె అనుకొన్నట్టే తను ప్రవర్తించాడు. కాని అతనికో సందేహం కలిగింది.

"అలా ప్రవర్తిస్తే లాభం?"

"వాడి కేదైనా సహాయం చెయ్యకలిగితేగాని మీకు మనసుకి శాంతి ఉండదు. కాని ఏం చెయ్యగలరు? అది మీకు తలకుమించినవిషయం. ఊరికే మథనపడటం తప్ప జరిగేదేమీ ఉండదు. అశాంతికి అంతుండదు. అశాంతి పొందుతున్న మనసు అది తప్పించుకోటానికి ఎంత చిన్న అవకాశం దొరికినా ఉపయోగించుకొంటుంది."

వల్లభరావుకి విషయం పూర్తిగా బోధపడ్డది. ఆమె ఇంకేదో చెప్పబోతోంది. వల్లభరావు సిగ్గుపడ్డాడు. తలవంచుకొని అన్నాడు. "ఇహ చెప్పక్కర్లేదులెండి, తెలిసింది."

ఆమె ఇంకేమీ అనలేదు. అతనూ ఏమీ అనలేదు. కొద్ది క్షణాలు అలాగే గడిచిపోయాయి. ఎవరి మనసులో ఏ ఆలోచనలు మెదుల్తున్నాయో ఇద్దరికీ తెలుసు.

వెన్నెల స్పష్టమౌతోంది క్రమంగా. ఆమె సెలవు తీసుకొంది. దూరమైపోతున్న ఆ ఆకృతుల వైపు చూస్తూ అక్కడే నిలబడిపోయాడు వల్లభరావు, హృదయంలోని బరువుతో.

ఆ పసివాడితో సహా ఆమె అదృశ్యమైంది. వల్లభరావు సముద్రంవైపు చూచాడు. వెన్నెల్లో సముద్రం పొంగిపోతోంది. ఓ పెద్ద అల...అతని సమీపంలో నల్లటి మచ్చలుగల తెల్లటి శంఖం—ఆ అపురూప శంఖం వెన్నెల్లో మెరిసింది. అతను సముద్రంవైపు రెండడుగులు వేశాడు. కాని మళ్ళీ ఆగిపోయాడు. మరి కొంచెంసేపట్లో ఆ శంఖం క్రమక్రమంగా నీళ్ళలోకి దొర్లిపోయింది.

వల్లభరావు సముద్రపుటంచునే నడుస్తున్నాడు. ఆమె కోరికప్రకారం జరిగినసంగతి తను మర్చిపోటానికే ప్రయత్నిస్తాడు. మర్చిపోగలడు కూడా.